# నమ్ముట నీవలన అవుతుందా...?

మార్కు 9:14-24 ఈ వాక్యభాగంలో ఒక తండ్రి మూగ దయ్యము పట్టిన కుమారుని యేసు యొద్దకు తీసుకొచ్చినప్పుడు యేసు పలికిన మాట (23వ)“యేసు-నమ్ముట నీవలననైతే నమ్మువానికి సమస్తము సాధ్యమే...”. క్రైస్తవుడు బ్రతికేది విశ్వాసం ద్వారానే. ‘నమ్మకం’ ‘విశ్వాసం’ లేకుండ ఏమి పొందుకొనలేము. పరిశుద్ధ గ్రంథములో అనేకమైన వాగ్దానాలు ఉన్నాయి కాని, విశ్వాసంలేకుండ ఆ వాగ్దానాలు పొందలేము. అడుగుడి మీకు ఇవ్వబడును, అడుగు ప్రతివానికి ఇవ్వబడునని వాక్యం చెప్తుంది. కాని, విశ్వాసంలేకుండ అడిగితె ఏమి పొందుకొనలేము. విశ్వాసం ద్వారానే ఏమైన పొందకొనగలము. విశ్వాసంలేకుండ దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము; (హెబ్రీ 11:6). “... నేను ఆయనకు ఇష్టుడను గనుక ఆయన నన్ను తప్పించెను” (కీర్తనలు 18:19). విశ్వాసం ద్వారా దేవునికి ఇష్టులమైతాము, దేవునికి ఇష్టులము కాబట్టే ప్రతి కష్టం, నష్టం, ఆపద, శ్రమ మొదలగు వాటినుండి తప్పించబడుతాము.

క్రైస్తవుడు ఎలాంటి విశ్వాసం కలిగియుండాలి? అబ్రాముతో దేవుడు ఆదికాండం 17:3-5 వచనములలో ఇక మీదట నీ పేరు అబ్రాము అనబడదు, నిన్ను అనేక జనములకు తండ్రినిగా నియమించితిని గనుక నీ పేరు అబ్రహాము అనబడును అని దేవుడు అబ్రామునకు, అబ్రాహాము అని పేరు పెట్టాడు. ఈ పేరు పెట్టినప్పుడు అబ్రాహామునకు 99 సం||లు, పిల్లలేలేరు. నాకు పిల్లలు లేరు, పిల్లలు పుట్టిన తరువాత ఈ పేరు పెట్టుకుంటాను ప్రభువా అని దేవునితో చెప్పలేదు. విశ్వాసంతో పిల్లలులేకపోయినా అబ్రాహాము నేను అనేక జనములకు తండ్రిని అని పిలుచుకున్నాడు. విశ్వాసానికి సరియైన నిర్వచనం అబ్రాహాము.

ప్రియ చదువరి! మనం ఏదైతే యేసు నామంలో అడుగుతామో, అది పొందామని నమ్మాలి. అంటే, మనం అడిగింది పొందక మునుపే అబ్రాహాము వలె పొందినట్లు నమ్మాలి. దేవుని ఈ విధముగ నమ్ముట నీవలన అవుతుందా? లేకపోతే, ఆ మూగవాని తండ్రి వేడుకొనినట్లు “ నాకు అపనమ్మకముండకుండ సహాయము చేయుమని” (మార్కు 9:24) బిగ్గరగా ప్రార్థించు.




**గమనిక: సీయోను సందేశం గురించి మీ అభిప్రాయములు సజెషన్ బాక్స్ లో వేయగలరు...**



## కాపరి లేఖ!

యేసుక్రీస్తుని రక్షకునిగ స్వీకరించి జీవిస్తున్న సంఘ సభ్యులందరికి అద్వితీయుడు, ఆశ్చర్యకరుడు, ఆదిసంభూతుడైన ప్రభు నామమున శుభములు.

గడచిన నాలుగు మాసములు తన అపారమైన కృపను మన యెడల కనుపరచి, ప్రతి విధమైన నిరుత్సాహమునుండి, నిందలనుండి, ఆర్థిక, మానసిక, శరీర సమస్యల నుండి మనలను విడిపించి, నడిపించిన ప్రభువునకు మహిమ ప్రభావములు కలుగును గాక!

ఏప్రిల్ మాసములో ఆధ్యాత్మిక కార్యక్రమములు జరిగించుటలో ప్రభువు ఇచ్చిన సహకారమునుబట్టి స్తుతిస్తున్నాము. ప్రత్యేకముగ ఏప్రిల్ 18వ తారీఖు నుండి 27వ తారీఖు వరకు VBS జరిగించుటలో పరిశుద్ధాత్మ నడిపింపును రుచి చూడగలిగినాము. తెలంగాణ ప్రభుత్వము సెలవులు ప్రకటించుటను బట్టి VBS వారం ముందుగానే ఆరంభించుట జరిగినది. అయినను దాదాపు 260 మంది పిల్లలు, టీచర్లు, వాలంటీర్స్ అందరు కలిసి 350 మంది ఈ కార్యక్రమములో పాలుపొంది ఆశీర్వదింపబడినారు. VBS ఘనముగ జరిగించుటలో మీరందరు అందించిన ప్రార్థన, ఆర్థిక సహకారమునుబట్టి వందనములు. ఒక కుటుంబముగ అందరు కలసి అద్భుతముగ జరిగించారు, అందరిని అభినందిస్తున్నాము.

మొట్టమొదటి సారి ఎల్లమ్మబండ బేతారాము సంఘములో ఏప్రిల్ 29,30 మే 1వ తారీఖులలో VBS ఏర్పాటు చేసాము. దాదాపు 90 శాతం అన్యకుటుంబములకు చెందిన పిల్లలు వచ్చి పాలుపొందారు. సీయోను మందిరం నుండి 30 మంది వెళ్లి కార్యక్రమం జరిగించారు. మూడు దినములు జరిగిన కార్యముల ద్వారా ఆ ప్రాంత పెద్దలు, పిల్లల తలిదండ్రులు ఎంతగానో సంతోషించారు, వారి పిల్లలు మంచి విషయాలు నేర్చుకున్నారని ఇచ్చిన సాక్ష్యమును బట్టి దేవుని మహిమపరుస్తున్నాము.

బెయెర్షేబా సంఘము (ఉప్పుగూడ) పరిచర్యకు ఆటంకము కలుగకుండ పరిచర్య జరుగుట కొరకు ప్రార్థించండి. ప్రభువు చిత్తమైతే ఈ మాసములో కోర్టు కేసు కొట్టివేయబడునట్లు ప్రార్థించండి. వాతావరణ దృష్ట్యా 11,12,13 తారీఖులలో జగ్గయ్యపేటలో 60 గ్రామములలో జరగవలసిన సువార్త దండయాత్ర సెప్టెంబర్/అక్టోబర్ మాసమునకు మార్చబడినదని తెలియజేస్తున్నాము.

సంఘ పరిచర్యలో ఆత్మీయ కార్యక్రమములలో మీరందరు చూపిస్తున్న ఆసక్తినిబట్టి, పరిచర్యను ప్రోత్సహిస్తున్న విధానముబట్టి ప్రభువు నామమున మిమ్ములనందరిని అభినందిస్తూ పరిశుద్ధ స్థలము నుండి ఆశీర్వదించు దేవుని కృప మీ అందరి మీద అధికముగ ఉండాలని కాపరిగా నా ప్రార్థన...

- రెవ. జాన్ పాల్ రెడ్డిపోగు

# ఎంతైనా తండ్రి ప్రేమ కదయ్యా...!

ఒకానొక దేశమందు ఆ దేశపు రాజు మరియు మంత్రి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. అనేకసార్లు మంత్రి రాజు గారితో దేవుని ప్రేమను గురించి ఆయన చేసిన త్యాగమును గురించి, మానవాళిని రక్షించుటకు ఆయనే సాక్షాత్తు మానవునిగా దీనునిగా పశువులశాలలో జన్మించుట గురించి చెబుతూ ఉండేవాడు. కాని, ఆ రాజుకు మాత్రం దేవుని గురించి మాట్లాడటం అసలు ఇష్టముండేది కాదు. ఓ రోజు కోపంగా మంత్రితో, మీ దేవుడు మానవాళిని రక్షించాలనుకుంటే ఆయనే ఎందుకని పరలోకం నుండి దిగి రావాలి? దూతనో, ప్రవక్తనో, అవతార పురుషులనో పంపించవచ్చు గదా? ఆయనే వచ్చి రక్షించాలా? అని విడ్డూరంగా అడిగెను. దానికి మంత్రి గారు ఏమి మాట్లాడలేదు.

ఓ సాయంత్రం రాజుగారు, మంత్రి కలిసి అందమైన కొలనులో పడవలో వెళ్ళుచు ఉండెను. చుట్టూ సైన్యము రాజును వెంబడించుచు ఉండిరి. రాజు మాట్లాడుతూ తన కనుదృష్టి గట్టు ఒడ్డున ఆడుకుంటున్న యువరాజు మీద పడెను. ఆశ్చర్యంతో, అలా చూస్తుండగా కాలుజారి బాలుడైన ఆ రాకుమారుడు ఆ కొలనులో పడిపోయెను. ఇంకేముంది రాజుగారు మరోమాట లేకుండ అమాంతంగా కొలనులో దూకి తన కుమారుని రక్షించుకొని ఇంటికి తీసుకొని వెళ్ళెను.

రాజా! మీ ప్రక్కన నమ్మకమైన మంత్రిని నేను ఉన్నాను. మనచుట్టు ఎంతోమంది సైనికులు ఉన్నారు. ఒక్కమాట సెలవిస్తే మేము వెళ్లి రక్షించేవారము కదా? మీరే ఎందుకు రక్షించారు? అని ప్రశ్నించెను మంత్రి. వెంటనే రాజు తడుముకోకుండ "ఎంతైనా తండ్రి ప్రేమ కదయ్యా" అది నన్ను బలవంతము చేసింది. అందుకే ప్రాణాలను తెగించి నా కుమారుడ్ని రక్షించుకున్నాను. రాజా! 2000 సం||ల క్రితం దేవుణ్ణి బలవంతం చేసింది ఆ తండ్రి ప్రేమే. కాబట్టే ఆయన ఎవర్ని పంపక తానే తన బిడ్డలమైన మనలను రక్షించుకొనుటకు ఈ లోకానికి వచ్చెనని చెప్పగా, రాజు సత్యమును గ్రహించెను.

రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువైన ఆ దేవా దేవుడు మానవులను రక్షించుటకు వచ్చినప్పుడు, ఆయనకు కొద్దిపాటి స్థలంకూడ ఇవ్వలేదు ఈ పాడులోకం. కనీసం సత్రంలో కూడా ఆయన జన్మించడానికి చోటు దొరకలేదు. (లూకా 2:7) చివరకు తమను రక్షించుటకు ఈ లోకానికి ఏతెంచిన యేసుక్రీస్తు జన్మించుటకు ఈ లోకం కేటాయించిన స్థలం ఏమిటో తెలుసా? పశువుల శాల. ఎంత దీనాతి దీనము? మనమీద ఆయనకున్న ప్రేమ తనను బలవంతం చేసెను కనుక ఎంతో దీనునిగా జన్మించెను. సర్వసృష్టికర్త సర్వోన్నతుడైన దేవుడు ఈ భూమిమీద సంచరించినప్పుడు "నక్కలకు బొరియలును ఆకాశపక్షులకు నివాసములును కలవు గాని మనుష్యకుమారునికి తలవాల్చుకొనుటకైనను చోటులేని" వానిగా మన కొరకై సంచరించెను. (మత్తయి 8:20)

ప్రియ చదువరి! దేవ దేవుడు ఈ లోకాన దిక్కుమాలిన వాడిగా ఎందుకు ఉదయించాల్సి వచ్చింది? నీ కోసమే! ఎందుకని ఆయన తన మహిమను విడిచి దరిద్రునిగా జన్మించింది? నీ కోసమే! ఆయన పరలోక రాజైయుండి ఆ రాజ్యాన్ని విడిచి ఈ పాపలోకానికి దరిద్రునిగా వచ్చిన కారణం ఏమిటో తెలుసా? దరిద్రులమైన మనము ఈ పాడు లోకాన్ని విడిచి ఆయనతో మహిమ లోకానికి రావాలనే! మరి ఇంతగా నీ కొరకు తన్నుతాను తగ్గించుకొని, దీనునిగా జన్మించిన ఆ యేసుకు నీ హృదయంలో చోటుందా? లేకపోతే ఈ రోజైన చోటిస్తావా?



# VBS 2016 లో పాలుపొందిన పిల్లల సాక్ష్యములు

నాకు 2016 VBS చాలా నచ్చింది. పాటల ద్వారా, కథల ద్వారా చాలా ఆనందించాను. Sing for Joy అనే Theme నాకు చాలా నచ్చింది. ఆ Theme ద్వారా దేవునియందు ఎలా సంతోషించాలో నేర్చుకున్నాను. VBSలో చెప్పిన కథల ద్వారా దేవుని ఎలా స్తుతించాలో ఆయనకు ప్రధమ స్థానం ఇవ్వాలని నేర్చుకున్నాను. నేను VBS ద్వారా బలపడ్డాను. – G. Rushitha

VBS చాలా బాగుంది. VBSలోని పాఠముల ద్వారా నేను చాలా విషయాలు నేర్చుకున్నాను. ప్రవక్తలు ఏమేమి పనులు చేసారో తెలుసుకొని, నేను కూడ వారిలా జీవించాలని తీర్మానించుకున్నాను. హగ్గయి ద్వారా దేవునికి ప్రధమ స్థానం ఇవ్వాలని తీర్మానం తీసుకున్నాను. – V. Sathvika

VBS లో పాటలు, తలిదండ్రులను గౌరవించడం నేర్చుకున్నాను. ఎక్కువగ దేవుని ప్రేమ గురించి తెలుసుకున్నాను. ఇశ్రాయేలీయులు దేవునికి ఎదురు తిరిగిన, దేవుడు అనేకమంది ప్రవక్తలను పంపి దేవుని ప్రేమను వారికి బోధించాడు. దేవుడు తన విస్తారమైన ప్రేమను చూపించి నాకు కావలసినది ఏదైనా ఇవ్వగలడని తెలుసుకున్నాను. – B. Sudha Archana

దేవునితో మంచి సంబంధం పెట్టుకొనుటకు VBS చక్కని వేదిక. VBSకి రాకముందు బోర్ గా ఫీల్ అయ్యాను కాని, వచ్చిన తరవాత ఎంతగానో ఎంజాయ్ చేసాను. ప్రతి రోజు ఒక ప్రత్యేకమైన దినముగా జరపడం ఎంతో సంతోషముగా ఉంది. వచ్చే సంవత్సరం VBS కొరకు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాను. – Ch. Veerendra

నేను 5సం||ల నుండి VBS కి వస్తున్నాను. దేవుని గురించి చాలా విషయాలు నేర్చుకున్నాను. టీచర్స్ చాలా చక్కగా పాఠములు బోధించారు. నా వస్తువులను ఇతరులకు పంచడం, క్రొత్త స్నేహితులను కలవడం, గేమ్స్ లో చాలా సంతోషించాను.

– G. Aruna

VBS కి వెళ్ళడం ద్వారా ఎన్నో ఆత్మీయ విషయాలు తెలుసుకున్నాను. ప్రతి సంవత్సరం సీయోను మందిరములో VBS జరుగుట ద్వారా అనేక మంది రక్షించబడాలని ప్రార్థిస్తున్నాను. ఈ VBS లో నేను నేర్చుకున్న పాఠముల ద్వారా ఎంతో బలపడ్డాను, వాటి ప్రకారం జీవించాలని కృషి చేస్తున్నాను. నేను దేవుని కొరకు జీవించాలని తీర్మానం తీసుకున్నాను. - J. Angel Peace

నేను 2004 నుండి VBS కి వస్తున్నాను. VBS లో ఎన్నో విషయాల గురించి తెలుసుకున్నాను, వాటిని నేర్చుకున్నాను. పేరుకి క్రైస్తవరాలుగా కాకుండా దేవుని ఎలా ప్రేమించాలి, ఇతరులకు దేవుని ప్రేమను ఎలా చూపించాలి, దేవుని సువార్తను ఇతరులకు ఎలా చెప్పాలో VBS లో తెలుసుకున్నాను. - M. Darshini Esther

## గమనిక :

ప్రియమైన పాఠకులు! మీరు వాక్యంలో ఇంకా లోతైన విషయాలు తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే క్విజ్ వేస్తున్నాము. దయచేసి కొంత సమయం కేటాయించి చదివి క్విజ్ వ్రాయుటకు ప్రయత్నం చేయగలరు. చదివి వ్రాయుట వలన క్రొత్త విషయాలు మాత్రమే కాదు ఆ సమయములో వాక్యముతో దేవుడు మీతో మాట్లాడుతాడు. పరిశుద్ధాత్మ మిమ్ములను నడిపించును.

జవాబులు వాక్యమంత వ్రాయకుండ సరియైన పదములను రిఫరెన్సులతో వ్రాయండి.

**బైబిల్ క్విజ్ 16**

## హూషేయ నుండి

1.ఇశ్రాయేలు ఎలా ఉండగ ఐగుప్తు దేశములో నుండి పిలువబడినాడు?

2. దేశము ఎందుకు ప్రలాపించుచున్నది?

3. ప్రజలు ఎందునుబట్టి యెహోవాను ఎరుగకయున్నారు?

4. ఏ పట్టణము పాపాత్ముల పట్టణమైనది?

5. ఎవరి కీర్తి పక్షివలె ఎగిరిపోవును?

6. దేవుడు తన ప్రజలను ప్రధానము చేసుకొనుటకు రెండు కారణములు వ్రాయండి.

7. దేవునికి ఏది ఇష్టమైనది?

8. దేవుడు ఎందుకు ఇశ్రాయేలువారి కుమారులను మరచిపోతానని అన్నాడు?

9. ఎఫ్రాయిము పాపము చేయుటకు ఏది ఆధారమైనది?

10. నీతిమంతులు వేటిని అనుసరించి నడచుకొందురు?

**సమాధానములు వచ్చే సంచికలో**

**క్విజ్ 15 సమాధానములు:** 1. దేవుడు, పరిశుద్ధ ప్రవక్తల నోట 2. శాతాధిపతి 3. ఎఫేసిలో ఉన్న దేమేత్రియను ఒక కంసాలి మరియు ఇలాంటి పని చేసే కంసాలులను 4. సమాధానము కలిగియుండాలి 5. పోప్లి 6. వాక్యము బోధించుటయందు 7. బంధకములును, శ్రమలు 8.దావీదు, యేసు ప్రభువును గూర్చి 9. ఏథెన్సు 10. విశ్వాసమందు నిలకడగా ఉండి అనేక శ్రమలు అనుభవించాలి

**క్విజ్ 15 - సరియైన సమాధానములు వ్రాసినవారు:** 1Jyothi 2. Rebecca Issac 3. K. Madhavi 4. Jyothi Chritopher



**బైబిల్ క్విజ్ ౭**

**సండేస్కూల్ క్విజ్ 15 సం|| లోపు పిల్లలకు**

## యోహాను మొదటి పత్రిక నుండి

1.ఎవరు లోకమును జయించారు?

2. దేవునియందు నిలిచియుండువాడు ఏమి చేయడు?

3. మనము ఏమి అడిగినను దేవునివలన మనకు ఎలా దొరుకుతుంది?

4. ఎవరు జీవములేనివారు?

5. దుష్టుడు మనలను ముట్టకూడదంటే ఏమి చెయ్యాలి?

6. చిన్న పిల్లలు ఎవరిని ఎరిగియున్నారు?

7. దేవునిమూలముగా పుట్టినవాడు ఏమి జరిగిస్తాడు?

8. యేసుక్రీస్తు ఎందుకు ప్రత్యక్షమైనాడని యోహాను అన్నాడు?

9. యోహాను ఈ పత్రిక ఎందుకు వ్రాసాడు?

10. భయమును ఏది వెళ్ళగొట్టుతుంది?

**సరియైన జవాబులు వ్రాసిన వారు 7306935455 ఈ నెంబర్ కి ఫోన్ చేసి తెలియజేయగలరు.**

**క్విజ్ 8 సమాధానములు:** 1. పేతురు 2. సీమోను 3. ఫలమిచ్చు జనులకు 4. ఆదివారము తెల్లవారుచుండగా 5. ఇద్దరు 6. బాలుర యొక్కయు, చంటిపిల్లల 7. పరిచారకుడై ఉండవలెను 8. నీతిమంతులు 9. మెలుకువగా ఉండి ప్రార్ధన చెయ్యాలి 10. ప్రధాన యాజకుడు

**క్విజ్ 8 కి సమాధానములు వ్రాసినవారు:** 1. Venny (9 సమాధానములు) 2. K. Sandeep (8 సమాధానములు)

## నీ సమస్యకు పరిష్కారం కావాలా?

దేవుని నమ్ముతే పరిష్కారంలేని సమస్య లేదు, సమాధానంలేని ప్రశ్న ఉండదు. సమస్య ఎలాంటిదైన దానికి పరిష్కారం దేవుని దగ్గర ఉన్నది. సమస్య ఎంత పెద్దదైన ఇద్దరు ముగ్గురు కలిసి ఏకీభవించి ప్రార్ధిస్తే నిశ్చయముగ పరలోకమందున్న దేవుడు దయచేస్తాడని యేసు ప్రభువు స్పష్టము చేసాడు.

ఎలా దయ చేస్తాడు?(మత్తయి 18: 19,20) ఎక్కడ ఇద్దరు ముగ్గురు కూడియుంటారో అక్కడ యేసు ప్రభువు ఉంటాడు. మనము యుక్తముగా ఏలాగు ప్రార్ధన చెయ్యాలో మనకు తెలియదు గనుక ఆత్మ మన మధ్య ఉండి మన పక్షముగా విజ్ఞాపనము చేస్తాడు (రోమా 8:26). మనలో, మన మధ్యలో ఉన్న దేవుని ద్వారానే మన ప్రార్ధన అంగీకరించబడుతుంది.

ఒంటరిగా అన్ని సాధించలేము. భార్యభర్తలు, స్నేహితులు, సహోదరులు, సహోదరీలు కలిసి ప్రార్ధించుట అలవాటు చేసుకోండి. దేవుని శక్తిమంతమైన కార్యములు చూడగలరు.